సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు

శనివారం । 18 । జనవరి । 2025



సోమశిలలో 69.890 టీఎంసీలు

సోమశిల: జలాశయంలో శుక్రవారం 69.890 టీఎంసీల నీరు నిల్వ ఉంది. పైతట్టు ప్రాంతాల నుంచి 1927 క్యూసెక్కుల వరద ప్రవాహం వచ్చి చేరుతోంది.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రాములు)	రూ.81,780
22 క్యారెట్ల ఆర్నమెంట్ (గ్రా)	రూ.7,417
మూడు శాతం జీఎస్టీతో	రూ.7,640
సవర (8 గ్రాములు)	రూ.61,120

గరిష్టం/కనిష్టం
29.2 /23.3

వాతావరణం

జిల్లాలో వాతావరణం శనివారం సాధారణంగా ఉంటుందని ఆ శాఖ అధికారులు తెలిపారు. గాలిలో తేమ శుక్రవారం 70 శాతంగా నమోదైంది.

న్యూస్‌రీల్

రూ.100కి చేరువైన వంకాయల ధర

• మునక్కాయ ఒకటి రూ.20



నెల్లూరు(సెంట్రల్): భోజనంలో వంకాయ కూర అంటే ఇష్టపడని వారు ఉండరు. కానీ ప్రస్తుతం వంకాయలు కొని వండుదామంటే ధరలు మండిపోతున్నాయి. మార్కెట్‌లో వంకాయల ధర కిలో రూ.100కి చేరువైంది. నెల్లూరులోని హోల్‌సేల్ కూరగాయాల మార్కెట్‌లోనే వ్యాపారులు కిలో రూ.80 నుంచి రూ.90కి అమ్ముతున్నారు. రిటైల్‌గా అమ్మేవారు రూ.100కి విక్రయాలు చేస్తున్నారు. దీనికి తోడు మునక్కాయలు గతంలో పదికి రెండు ఇచ్చేవారు. కానీ ప్రస్తుతం ఒక మునక్కాయ ధర రూ.20కి చేరింది. రానున్న రోజుల్లో ఈ ధరలు ఇంకెంత పెరుగుతాయోనని వినియోగదారులు ఆందోళన చెందుతున్నారు.



ఒక యూనిట్లోనే విద్యుదుత్పత్తి

ముత్తుకూరు: మండలంలోని నేలటూరులో ఉన్న శ్రీదామోదరం సంజీవయ్య ఏపీ జెన్‌కో ప్రాజెక్ట్‌లో ఒక్క యూనిట్ నుంచి మాత్రమే విద్యుదుత్పత్తి జరుగుతోందని ఇంజినీర్లు శుక్రవారం తెలిపారు. మూడో యూనిట్లో 560 మెగావాట్ల విద్యుదుత్పత్తి జరుగుతోంది. బాయిలర్‌లో సాంకేతిక లోపం వల్ల ఒకటో యూనిట్లో, ఓవర్ ఆయిలింగ్ కారణంగా రెండో యూనిట్లో ఉత్పత్తి నిలిపివేసినట్టు వెల్లడించారు.

నుడా కార్యదర్శిగా పెంచలరెడ్డి

నెల్లూరు(అర్బన్): నెల్లూరు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (నుడా) కార్యదర్శిగా రెవెన్యూ శాఖలో ప్రత్యేక డిప్యూటీ తహసీల్దార్‌గా పని చేస్తున్న అల్లంపాటి పెంచలరెడ్డిని ప్రభుత్వం నియమించింది. దీంతో ఆయన శుక్రవారం నుడా కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఆయన తెలుగుగంగ భూసేకరణ విభాగంలో పనిచేస్తూ నుడాకు బదిలీ అయ్యారు. ఆయన ఏపీ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ (ఏపీఆర్ఎస్ఏ) జిల్లా అధ్యక్షుడిగా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు.

నేడు నవోదయ ప్రవేశపరీక్ష

మర్రిపాడు: మండలంలోని కృష్ణాపురం జవహర్ నవోదయ విద్యాలయంలో 2025–26 విద్యా సంవత్సరానికి సంబంధించి ఆరో తరగతిలో ప్రవేశానికి పరీక్షను శనివారం నిర్వహించనున్నారు. ఆరోతరగతిలో 80 సీట్లు ఉండగా, 5,159 మంది విద్యార్థులు పోటీ పడుతున్నారు. గ్రామీణ ప్రాంత విద్యార్థులకు 75 శాతం, పట్టణ ప్రాంతం వారికి 25 శాతం సీట్లు కేటాయిస్తున్నారు. మొత్తం సీట్లలో 33 శాతం సీట్లు బాలికలకు ఇస్తారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 21 కేంద్రాల్లో ఉదయం 11.30 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు పరీక్ష నిర్వహిస్తారు. ఉదయం 10.30 గంటలకే విద్యార్థులకు పరీక్ష కేంద్రానికి చేరుకోవాలి. ఉదయం 11 గంటల వరకు అనుమతిస్తారు. ఒక్క నిమిషం ఆలస్యమైనా అనుమతించరు.

మహిళల ఆర్థికాభివృద్ధికి చర్యలు

• డీఆర్‌డీఏ పీడీ నాగరాజకుమారి



మాట్లాడుతున్న పీడీ నాగరాజకుమారి

నెల్లూరు (పొగతోట): జిల్లాలోని పొదుపు మహిళల ఆర్థికాభివృద్ధిని పెంపొందించేలా ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు డీఆర్‌డీఏ పీడీ నాగరాజకుమారి అన్నారు. శుక్రవారం డీఆర్‌డీఏ కార్యాలయం నుంచి వివిధ మండలాల ఎంపీడీఓలతో నిర్వహించిన జూమ్ కాన్ఫరెన్స్‌లో పీడీ మాట్లాడారు. పొదుపు మహిళలకు బ్యాంకుల ద్వారా రుణాలు మంజూరు చేయించి కుటీర పరిశ్రమలు ఏర్పాటు చేయించామన్నారు. మహిళలు తయారు చేస్తున్న వస్తువులకు మార్కెటింగ్ కల్పించేలా చర్యలు చేపడుతున్నామన్నారు. దీనికి సంబంధించి ఎంపీడీఓలు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు.

కార్పొరేషన్ పరిధిలో ఏర్పాటు చేసిన లేఅవుట్‌లో ప్రజాప్రయోజనాల కోసం కేటాయించిన భూమిపై అధికార పార్టీ నేతల కన్నుపడింది. ఖాళీ జాగా కనిపిస్తే చాలు గద్దల్లా వాలిపోయి కబ్జాలు చేసి విక్రయాలు చేసుకుంటున్నారు. తాజాగా కార్పొరేషన్ పరిధిలో బిట్–1 గ్రామ సర్వే నంబర్‌లోని దాదాపు రూ.7.5 కోట్ల విలువ చేసే భూమిని కబ్జా చేసి నకిలీ డాక్యుమెంట్లు సృష్టించి ఇతరులకు రిజిస్ట్రేషన్ చేయించారు. విలువైన స్థలాలు దురాక్రమణ కావడంపై నగర కమిషనర్‌కు ఫిర్యాదులు వెళ్లడంతో ఈ వ్యవహారాన్ని సీరియస్‌గా తీసుకుని అక్రమ రిజిస్ట్రేషన్‌లు రద్దు చేయాలని ఆదేశాలివ్వడం చర్చనీయాంశమైంది.

కార్పొరేషన్ స్థలం కబ్జా

రూ.7.5 కోట్ల విలువైన స్థలాన్ని కాజేసి..

- నకిలీ డాక్యుమెంట్లు సృష్టించి..
- రిజిస్ట్రేషన్లు చేయించిన టీడీపీ నేతలు
- వాటిని రద్దు చేయాలని కమిషనర్ ఆదేశాలు
- మల్లగుల్లాలు పడుతున్న అధికారులు



కబ్జా చేసిన స్థలంలో మట్టిని చదును చేస్తున్న పొక్లయిన్



అక్రమ రిజిస్ట్రేషన్‌ను రద్దు చేయాలంటూ కమిషనర్ జారీ చేసిన ఆదేశాలు

సాక్షి ప్రతినిధి, నెల్లూరు: మున్సిపల్ శాఖ మంత్రి పొంగూరు నారాయణ ప్రాతినిధ్యం వహిస్తున్న నెల్లూరు నగర కార్పొరేషన్ పరిధిలో స్థలాల దురాక్రమణపై ప్రజలు మండిపడుతున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే నగరంలోని ఖరీదైన భూములపై అధికార పార్టీ నేతల కన్ను పడింది. ఎక్కడెక్కడ ఖాళీ స్థలాలున్నాయో వెతికి మరీ ఆక్రమణ చేస్తున్నారు. కార్పొరేషన్ పరిధిలోని నెల్లూరు బిట్–1 గ్రామ రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్ 140, 141లో ఒకటిన్నర దశాబ్దాల క్రితం లేఅవుట్ వేశారు. మొత్తం విస్తీర్ణం 7.42 ఎకరాల్లో 250 అంకణాల స్థలాన్ని ప్రజా ప్రయోజనాల కోసం రిజర్వు చేశారు. ఆ స్థలం కార్పొరేషన్ ఖాతాలో కలిసి పోయి ప్రభుత్వ భూమిగా మారింది. కానీ టీడీపీ నేతలు సదరు స్థలంపై కన్నేశారు. ప్రస్తుతం ఆ ప్రాంతంలో భూమి విలువ బాగా పెరిగింది. అంకణం విలువ రూ.3 లక్షల ధర పలుకుతోంది. ఈ క్రమంలో ఆ స్థలం విలువ రూ.7.5 కోట్లుగా ఉంటుంది. అంతటి ఖరీదైన స్థలాన్ని టీడీపీ నేతలు నకిలీ డాక్యుమెంట్లు సృష్టించి రిజిస్ట్రేషన్లు చేయించారు.

కమిషనర్‌కు ఫిర్యాదు

కార్పొరేషన్‌కు సంబంధించిన విలువైన స్థలాన్ని ఆక్రమించి రిజిస్ట్రేషన్ చేయడంపై స్థానికులు కమిషనర్ సూర్యతేజ దృష్టికి తీసుకెళ్లారు. ఆయన స్పందించి జిల్లా రిజిస్ట్రార్‌కు వెంటనే ఆ రిజిస్ట్రేషన్లు రద్దు చేయమని ఆదేశాలిచ్చారు. రిజిస్ట్రేషన్లు రద్దు చేయడమే కాకుండా వాటిని ఎవరు ఎవరికి ఎలా చేశారో నివేదిక ఇవ్వాలని ఆదేశాలివ్వడం నగరంలో చర్చనీయాంశమైంది.

రిజిస్ట్రేషన్ అధికారులపై ఒత్తిళ్లు

కోట్లాది రూపాయల విలువ చేసే స్థలాన్ని విక్రయించి సొమ్ము చేసుకున్న అధికార పార్టీ నేతలు.. చేసిన అక్రమ రిజిస్ట్రేషన్లు రద్దు చేయకుండా ఆ శాఖ అధికారులపై రాజకీయ ఒత్తిళ్లు తెస్తున్నారు. గత ఇరవై రోజులుగా ఈ వ్యవహారంపై అధికారులు మల్లగుల్లాలు పడుతున్నారు. రాజకీయ ఒత్తిళ్లు, మరోవైపు ఉన్నతాధికారుల ఆదేశాలతో సతమతమవుతున్నారు. రిజిస్ట్రేషన్లను రద్దు చేయడమే కాకుండా ఆ భూమిని నిషేధిత జాబితాలో ఉంచుతామని రిజిస్ట్రార్ బాలాంజనేయులు తెలిపారు.

పక్కాగా ఎల్సీడీసీ సర్వే

• అడిషనల్ డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఖాదర్‌వలీ



మాట్లాడుతున్న డాక్టర్ ఖాదర్‌వలీ

నెల్లూరు(అర్బన్): జిల్లాలో ఈనెల 20 నుంచి చేపడుతున్న ఎల్సీడీసీ (లెప్రసీ కేస్ డిటెక్షన్ క్యాంపెయిన్) సర్వేను క్షేత్రస్థాయిలో వైద్య సిబ్బంది పక్కాగా నిర్వహించాలని అడిషనల్ డీఎంహెచ్‌ఓ, జిల్లా లెప్రసీ నియంత్రణాధికారి డాక్టర్ ఖాదర్‌వలీ సూచించారు. శుక్రవారం స్థానిక కోటమిట్ట అర్బన్ హెల్త్ సెంటర్, మల్లికార్జునపురం పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలకు నగరంలోని చాకలివీధిలో శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఖాదర్‌వలీ మాట్లాడుతూ లెప్రసీని అరికట్టడమే ధ్యేయంగా వైద్యశాఖ సిబ్బంది పని చేయాలని కోరారు. ప్రజలు కూడా ఎలాంటి చర్మ సమస్యలున్నా వాటి గురించి వైద్యశాఖ సిబ్బందికి తెలిపి సహకరించాలన్నారు. కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్లు డాక్టర్ గీతాంజలి, డాక్టర్ ప్రతిమ, డాక్టర్ నవీన్, డాక్టర్ నాగేంద్రబాబు, కమ్యూనిటీ ఆర్గనైజర్ తిరుపతయ్యలు పాల్గొన్నారు.

తీరంలో తాబేళ్ల మరణ మృదంగం

ప్రకృతి సమతుల్యతను కాపాడేందుకు సముద్రపు తాబేళ్లు దోహదపడతాయి. అయితే అవి ఇటీవల చనిపోయి ఒడ్డుకు కొట్టుకు వస్తున్నాయి. తుమ్మలపెంట బీచ్‌లో కొన్ని తాబేళ్లు ఒడ్డున మరణించి ఉండటం అందర్నీ కలిచి వేసింది. ఈ మరణాలకు అనేక కారణాలు ఉండవచ్చని అనుమానిస్తున్నారు. – కావలి



తుమ్మల పెంట సముద్ర తీరంలో తాబేళ్ల కళేబరాలు

ఇలా జరిగి ఉండవచ్చు

- తుఫాన్లు, అలలు లేదా సముద్రంలో ఏర్పడిన అసహజ పరిస్థితుల వల్ల తాబేళ్లు తీరానికి కొట్టుకొచ్చి తిరిగి వెళ్లలేకపోవడంతో చనిపోవచ్చు.
- ఆహార కొరతతో తాబేళ్లు బలహీనమై చనిపోవచ్చు.
- సముద్రంలో ప్లాస్టిక్, రసాయనాలు వంటి కాలుష్యం తాబేళ్ల ఆరోగ్యాన్ని దెబ్బతీసి మరణానికి కారణమై ఉండవచ్చు.
- విషపూరిత రసాయనాలు (పరిశ్రమల నుంచి వచ్చేవి) సముద్రపు నీటిలో కలవడం వల్ల కావొచ్చు.
- చేపలు పట్టే వలల్లో ఇరుక్కుని తాబేళ్లు చనిపోతూ ఉండొచ్చు.

ప్రజలను చైతన్యపరచాలి

సముద్ర జీవశాస్త్రవేత్తలు, వన్యప్రాణి సంరక్షణ శాఖ, స్వచ్ఛంద సంస్థలు సముద్ర తీర ప్రాంతాల్లో నివాసం ఉంటున్న ప్రజలను చైతన్య పరచాలి. సముద్రంలోకి వ్యర్థాలు వెళ్లకుండా చూసుకోవాలి. తాబేళ్ల సంరక్షణ కేంద్రాలను ఏర్పాటు చేయడం. వాటిని రక్షించి సముద్రంలోకి వదలాలి. అంతరించిపోతున్న సముద్ర జీవులను రక్షించడానికి, సముద్ర పర్యావరణాన్ని కాపాడటానికి ప్రణాళికలు రూపొందించాలి.

కాపాడుకోవడం అందరి బాధ్యత

తుమ్మలపెంట బీచ్‌లో నిస్సహాయ స్థితిలో తాబేళ్లు మరణించడంపై కావలిలోని కలయిక విజ్ఞాన కేంద్రం కన్వీనర్లు జి.రాంప్రసాద్, ఇలింద్ర లావణ్య, సలహాదారు సి.శారదలు ఒక ప్రకటనలో విచారం వ్యక్తం చేశారు. సంతానోత్పత్తి కోసం ఉభయచరాల్లో భాగమైన తాబేళ్లు సముద్రతీరానికి రావడం ప్రకృతి సహజం. వాటిని కాపాడుకోవడం ప్రతి పౌరుడు బాధ్యతగా తీసుకోవాలని వారు తెలిపారు.

పెదపవనిలో ఉద్రిక్తత

- స్థల వివాదంలో ఇరువర్గాల ఘర్షణ
- స్టేటస్‌కో ఉన్నా ఫెన్సింగ్ వేసిన టీడీపీ నాయకులు
- న్యాయం కోసం రోడ్డుపై బైఠాయించిన వైఎస్సార్‌సీపీ జెడ్పీటీసీ సభ్యురాలు



పెదపవనిలో స్థలం వద్ద ఇరువర్గాల మధ్య ఘర్షణ

లింగసముద్రం: కోర్టు స్టేటస్‌కో ఉన్నా లెక్కచేయకుండా స్థలాన్ని ఆక్రమించేందుకు ప్రయత్నించడంతో రెండు వర్గాల మధ్య ఘర్షణ చోటు చేసుకుంది. ఈ సంఘటన లింగసముద్రం మండలంలోని పెదపవని గ్రామంలో శుక్రవారం జరిగింది. వివరాల ప్రకారం.. పెదపవని గ్రామ సర్వే నంబర్ 439/1లోని గ్రామ కంఠంలో కొంత స్థలాన్ని జెడ్పీటీసీ డాక్టర్ చెన్ను నళినీపద్మ గతంలో ముస్లింల వద్ద కొనుగోలు చేసి రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. ఆ విషయం గ్రామంలోని ముస్లింలకు తెలియడంతో గత సంవత్సరం ఆ స్థలం వద్దకు వెళ్లి ఇది పీర్లచావిడిగా ఉండేదని, దీనిని మీరు ఎలా రిజిస్ట్రేషన్ చేయించుకున్నారని అడిగారు. ముస్లిం పెద్దలు తమకు విక్రయించగా రిజిస్ట్రేషన్ చేయించుకున్నామని జెడ్పీటీసీ కుటుంబ సభ్యులు చెప్పారు. దీనిపై వివాదం రేగడంతో జెడ్పీటీసీ కోర్టును ఆశ్రయించగా స్టేటస్‌కో విధించింది. అయితే టీడీపీ నాయకుడు షేక్ రఫి ఆధ్వర్యంలో వందలాది మంది శుక్రవారం మధ్యాహ్నం ఆ స్థలం వద్దకు వెళ్లి జేసీబీతో గుంతలు తీసి ఫెన్సింగ్ వేయాలని ప్రయత్నించారు. దీంతో జెడ్పీటీసీ బంధువులు, గ్రామస్తులు అక్కడకు చేరుకుని వారించడంతో ఘర్షణ నెలకొంది. జేసీబీతో గుంత తీస్తుండగా గ్రామస్తులు అడ్డుపడటంతో వాహనం తగిలి ఎస్సై మహబూబ్ సుభానీతోపాటు కొందరు కిందపడ్డారు. దీంతో ఒక్కసారిగా ఉద్రిక్తత నెలకొని ఒకరిపై ఒకరు దాడి చేసుకున్నారు. ఈ క్రమంలో జెడ్పీటీసీ బంధువులకు స్వల్ప గాయాలయ్యాయి. అనంతరం పోలీసులు వారిని చెదరగొట్టారు. విషయం తెలుసుకున్న జెడ్పీటీసీ డాక్టర్ నళినీపద్మ ఆమె భర్త వైఎస్సార్‌సీపీ నాయకుడు చెన్ను ప్రసాద్ స్థలం వద్దకు చేరుకుని తమకు న్యాయం చేయాలని రోడ్డుపై బైఠాయించారు. దీంతో గుడ్లూరు సీఐ మంగారావు, తహసీల్దార్ సీతామహాలక్ష్మి అక్కడకు చేరుకుని ఇద్దరికీ సర్ది చెప్పేందుకు ప్రయత్నించారు.

అధికారులు న్యాయం చేయడంలేదు

స్థల వివాదం కోర్టులో ఉన్నా అధికారులు న్యాయం చేయడంలేదని జెడ్పీటీసీ సభ్యురాలు చెన్ను నళినీపద్మ అన్నారు. పార్టీలు వస్తుంటాయి, పోతుంటాయని దౌర్జన్యం చేసి నానా ఇబ్బందులకు గురిచేయడం బాధాకరమన్నారు. టీడీపీ నాయకుడు షేక్ రఫీ రాజకీయ ప్రయోజనాల కోసం కావాలనే కులాలు, మతాల మధ్య వివాదం నెలకొల్పేందుకు ప్రయత్నిస్తున్నారని అన్నారు. తమకు న్యాయం జరిగే వరకు ఆందోళన కొనసాగిస్తామని హెచ్చరించారు. సాయంత్రం 6.30 గంటల సమయంలో వివాదం జరుగుతుండగా పోలీసు బందోబస్తుతో ముస్లింలు ఫెన్సింగ్ వేశారు.



రోడ్డుపై బైఠాయించిన జెడ్పీటీసీ సభ్యురాలు డాక్టర్ నళినీపద్మ

ప్రతినెలా స్వచ్ఛాంధ్ర స్వచ్ఛత దివస్

నెల్లూరు రూరల్: ప్రతి నెలా మూడో శనివారం జిల్లా అంతటా స్వచ్ఛ ఆంధ్ర – స్వచ్ఛత దివస్ కార్యక్రమం నిర్వహించాలని కలెక్టర్ ఓ ఆనంద్ అధికారులకు సూచించారు. శుక్రవారం జిల్లా అధికారులతో కలెక్టర్ టెలి కాన్ఫరెన్స్ నిర్వహించి ఆ కార్యక్రమాలపై దిశానిర్దేశం చేశారు. కార్యక్రమాలలో ప్రజ లు ఎక్కువగా భాగస్వాములు అయ్యే విధంగా అధికారులు చర్యలు తీసుకో వాలన్నారు. గ్రామాల్లో, పట్టణాల్లో వీధులను, డ్రైనేజీలను తాగునీటి వనరులను, ఓహెచ్ఎస్ఆర్‌లను శుభ్రపరచాలన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడం వ్యాధులు రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వైద్యశాఖ అధికారులు, సిబ్బంది గ్రామాల్లో అవగాహన కల్పించాలన్నారు.

దివ్యాంగులకు రాయితీపై పెట్రోల్

నెల్లూరు రూరల్: మూడు చక్రాల వాహనాలు కలిగిన దివ్యాంగులు రాయితీపై పెట్రోల్ పొందేందుకు వనంతోపులోని జిల్లా విభిన్న ప్రతిభావంతులు, హిజ్రాలు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ కార్యాలయంలో సంబంధిత ధ్రువీకరణ పత్రాలతో దరఖాస్తు చేసుకోవాలని ఆ శాఖ సహాయ సంచాలకులు మహమ్మద్ అయూబ్ శుక్రవారం ప్రకటనలో తెలిపారు. మరిన్ని వివరాలకు కార్యాలయ ఫోన్ నం .0861–2329581ను సంప్రదించాలని కోరారు.

క్లుప్తంగా

ఉమ్రా యాత్ర పేరిట ట్రావెల్స్ సంస్థ మోసం

- కేసు నమోదు చేసిన పోలీసులు
- మోసగాళ్ల కోసం చెన్నైలో గాలింపు

నెల్లూరు(క్రైమ్): ఉమ్రా యాత్ర పేరిట చెన్నైకు చెందిన ఓ ట్రావెల్స్ సంస్థ జిల్లాలోని పలువురు ముస్లింల వద్ద నుంచి పెద్దఎత్తున నగదు వసూలు చేసి బోర్డు తిప్పేసింది. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు మోసగాళ్ల కోసం గాలిస్తున్నారు. ఈ విషయం శుక్రవారం వెలుగులోకి వచ్చింది. నెల్లూరు వెంగళరావ్‌నగర్ ఎన్‌సీసీ కాలనీకి చెందిన సయ్యద్ ఖాదర్ షరీఫ్ తన భార్య, బంధువు రిజ్వాన్ కుటుంబంతో కలిసి ఉమ్రా యాత్రకు వెళ్లాలని నిర్ణయించుకున్నాడు. రిజ్వాన్ ద్వారా ఖాదర్ నెల్లూరులోని జబ్బార్ మౌలానాను కలిసి ఈ విషయాన్ని తెలిపాడు. అతను చెన్నైలోని ఓ ట్రావెల్స్ సంస్థ గురించి చెప్పి వెంగళరావ్‌నగర్‌కు చెందిన అబ్దుల్ ముజీర్‌ను కలిస్తే మరింత సమాచారం వస్తుందన్నాడు. దీంతో వారు ముజీర్‌ను కలిసి అతడి ద్వారా ట్రావెల్స్ సంస్థ నిర్వాహకుడు జాఫర్, పీఏ సలాంను ఫోన్‌లో సంప్రదించారు. యాత్రకు ఒక్కొక్కరికి రూ.55 వేలు ఖర్చవుతుందని, ఆలస్యంగా చెల్లిస్తే రూ.60 వేలవుతుందని నిర్వాహకుడు చెప్పాడు. దీంతో ఖాదర్, రిజ్వాన్ కుటుంబసభ్యులు ముజీర్ ద్వారా రూ.3.40 లక్షల నగదు, ఒరిజినల్ పాస్‌పోర్టులను పంపారు. రోజులు గడుస్తున్నా ట్రావెల్స్ నిర్వాహకుడు వీసాలు పంపకపోవడంతో ఖాదర్, రిజ్వాన్‌లకు అనుమానం వచ్చింది. ముజీర్‌ను సంప్రదించగా ఆయన జాఫర్, సలాంకు ఫోన్ చేయగా స్విచ్ఛాఫ్‌లో ఉన్నాయి. దీంతో ఈనెల ఆరో తేదీన బాధితులు చెన్నైకి వెళ్లి చూడగా సంస్థ మూసి వేసి ఉంది. చుట్టుపక్కల విచారించినా ఫలితం లేకుండా పోయింది. దీంతో తమను మోసగించిన వారిపై చర్యలు తీసుకోవాలని ఖాదర్ షరీఫ్ నాలుగు రోజుల క్రితం వేదాయపాళెం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. వారు కేసు నమోదు చేశారు. ప్రత్యేక బృందం గురువారం చెన్నైకి వెళ్లి నిందితుల కోసం గాలిస్తోంది. ఇదిలా ఉంటే జిల్లాలో ఇదే తరహాలో సుమారు 150 మందికి పైగా మోసపోయినట్లు విచారణలో వెల్లడైనట్లు తెలిసింది.

వ్యక్తి బలవన్మరణం

సోమశిల: మండల పరిధిలోని శంకరనగరం గ్రామంలో ఓ వ్యక్తి పురుగు మందు తాగి బలవన్మరణానికి పాల్పడ్డాడు. శుక్రవారం ఎస్సై సూర్యప్రకాష్‌రెడ్డి వివరాలు వెల్లడించారు. గ్రామానికి చెందిన యర్ల కొండయ్య (55) కుటుంబ కలహాల నేపథ్యంలో ఈనెల 14వ తేదీన పొలానికి వెళ్లి మద్యంలో గడ్డి మందు కలిపి తాగాడు. ఈ విషయం తెలుసుకున్న కుటుంబసభ్యులు అతడిని చికిత్స నిమిత్తం నెల్లూరులోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్చగా చికిత్స పొందుతూ శుక్రవారం మృతిచెందాడు.

సహకార శాఖ డైరీ ఆవిష్కరణ

నెల్లూరు(అర్బన్): ఆంధ్రప్రదేశ్ సహకార శాఖ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ అమరావతి 2025 సంవత్సరం డైరీని జేసీ కార్తీక్ శుక్రవారం నెల్లూరులోని తన కార్యాలయంలో ఆవిష్కరించారు. అనంతరం జిల్లా సహకార శాఖాధికారి గుర్రప్ప ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల్లో పూర్తి దశలో ఉన్న కంప్యూటరీకరణ గురించి జేసీకి వివరించారు.

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు

బ్రాయిలర్ (లైవ్):	129
లేయర్ (లైవ్):	88
బ్రాయిలర్ చికెన్:	232
బ్రాయిలర్ స్కిన్‌లెస్:	256
లేయర్ చికెన్:	150



నిమ్మ ధరలు (కిలో)

పెద్దవి : రూ.39
సన్నవి : రూ.28
పండ్లు : రూ.18



క్షణికావేశం.. తీరని శోకం

కుటుంబ కలహాలు, ఆర్థిక సమస్యలు, ప్రేమ విఫలం, ఇంట్లో వాళ్లు మందలించారని.. ఇలా వివిధ కారణాలతో ఆత్మహత్య చేసుకునే వారి సంఖ్య జిల్లాలో నానాటికీ పెరుగుతోంది. కొందరు చిన్న చిన్న విషయాలకే కుంగిపోయి బలవన్మరణానికి పాల్పడి తనువు చాలిస్తూ కుటుంబాల్లో అంతులేని విషాదాన్ని నింపుతున్నారు.

- పెరుగుతున్న ఆత్మహత్యలు
- అర్థాంతరంగా ముగుస్తున్న జీవితాలు
- జిల్లాలో 17 రోజుల్లో పదిమంది
- మానసిక దృఢత్వం అవసరమంటున్న నిపుణులు



నెల్లూరు(క్రైమ్): సృష్టిలో వెలకట్టలేనిది.. అత్యంత విలువైంది ప్రాణం. తనకు ఎదురయ్యే సమస్యలకు పరిష్కార మార్గాలు కనుక్కునే అవకాశం ఉన్నా కొందరు చిన్న చిన్న విషయాలకే మనోస్థైర్యాన్ని కోల్పోయి ప్రాణాలను తీసుకుంటున్నారు. సమస్య ఏదైనా ఓర్పుగా పరిష్కారం వైపు అడుగులు వేయాలే తప్ప భయపడి బలవన్మరణానికి పాల్పడితే నమ్ముకున్న వారి పరిస్థితి ఏమిటో గ్రహించాలి. కుటుంబాన్ని గుర్తుచేసుకుంటే జీవితాన్ని అలవోకగా జయించవచ్చు.

17 రోజుల వ్యవధిలో..

చిన్న విషయాలకే విభేదాలు, గొడవలు, ఉద్వేగానికి లోనై క్షణికావేశంలో ఆత్మహత్య చేసుకుంటున్నారు. కుటుంబ సమస్యలనో.. ఆర్థిక ఇబ్బందులనో.. పరీక్షల్లో తప్పామనో, స్నేహితులు వంచించారనో, ప్రేమ విఫలమైందనో.. అనారోగ్యమనో.. వ్యసనాలకు బానిసయ్యామనో.. బెట్టింగ్‌లో సర్వం కోల్పోయామనో.. ఇలా రకరకాల కారణాలతో ఒత్తిడికి లోనై బలవంతంగా ప్రాణాలు తీసుకుంటున్నారు. సమస్యకు పరిష్కారం వెతుక్కునే సామర్థ్యం లేక, పరిష్కారం కోసం కొంత సమయం ఎదురుచూసే ధైర్యం లేక ఉరితాళ్లకు వేలాడుతూ కన్నవారిని, నమ్ముకున్నవారిని పుట్టెడు దుఃఖంలోకి నెడుతున్నారు. జిల్లాలో గడిచిన 17 రోజుల వ్యవధిలో పదిమంది ఆత్మహత్యలు చేసుకున్నారు. 15 మందికిపైగా ఆత్మహత్యాయత్నానికి పాల్పడి ప్రాణాపాయం నుంచి త్రుటిలో తప్పించుకున్నారు. ఆత్మహత్యలు చేసుకుంటున్న వారిలో అధికశాతం మంది 40 ఏళ్ల వయసు లోపు వారే ఉంటున్నట్లు తెలుస్తోంది. కాగా 50 ఏళ్ల వయసు పైబడిన వారిలోనూ ఈ ధోరణి అధికంగా ఉంటుందని వైద్య నిపుణులు చెబుతున్నారు.

తీరిక లేని జీవితాలు

గతంలో ఉమ్మడి కుటుంబాలుండేవి. ఒకరి బాధలను మరొకరు పంచుకునేవారు. పెద్దలు క్షణాల్లో సమస్యను పరిష్కరించి మేమున్నామని భరోసా ఇచ్చేవారు. కాలం మారింది. పరుగుల ప్రపంచంలో ఉమ్మడి కుటుంబాలు పోయి చిన్న చిన్న కుటుంబాలు ఏర్పడ్డాయి. ఆలోచనా విధానాలు కుటుంబసభ్యులను కూడా పట్టించుకోలేనంతగా మారిపోతున్నాయి. చిన్న సమస్యలకే ఆత్మస్థైర్యాన్ని కోల్పోతున్నారు. కుటుంబ సమస్యలు తలెత్తిన సమయంలో బాధలు మరొకరితో చెప్పుకోలేక వారిలో వారే కుంగిపోతూ ఆత్మహత్యల వైపు అడుగులు వేస్తున్న వారు ఎందరో ఉన్నారు.

అవగాహన లేక..

సమస్యలు ఎదురైనప్పుడు క్షణికావేశం ఆత్మహత్యకు దారి తీస్తోంది. జీవితం, సమస్యలపై సరైన అవగాహన లేకపోవడం కూడా కారణమే. మరణించిన వారు సమస్యను తప్పించుకుంటారే తప్ప బతికి ఉన్న వారి పరిస్థితి ఎలా ఉంటుందో చెప్పడం వర్ణనాతీతం. ఇంటి పెద్ద మరణిస్తే ఆ కుటుంబ పరిస్థితి అధ్వానంగా మారుతుంది. అల్లారు ముద్దుగా పెంచుకున్న కన్నబిడ్డలు ఆత్మహత్య చేసుకుంటే తల్లిదండ్రులు గుండెలవిసేలా రోదిస్తారు. వారిని ఓదార్చడం ఎవరి తరం కాదు. జీవితంలో ఎదురయ్యే సమస్యలను పోరాడి పరిష్కరించుకోవాలే తప్ప తప్పించుకునేందుకు ప్రాణాలను తీసుకోవడం సరైన నిర్ణయం కాదు.

ఇలా ఉంటే జాగ్రత్త పడాలి

ఆత్మహత్య చేసుకోవాలనుకునే వారు కొన్ని అసాధారణ లక్షణాలను కలిగి ఉంటారు. ఒంటరితనాన్ని కోరుకుంటారు. సకాలంలో ఆహారం తీసుకోకపోవడం, అతిగా నిద్రపోవడం, రాత్రి వేళల్లో నిద్రపోకుండా ఎక్కువగా ఆలోచించడం, అసలు దేనికీ స్పందించకపోవడం, చనిపోతున్నట్లు ముందుగానే పరోక్షంగా సంకేతాలివ్వడం లాంటివి చేస్తుంటారు. కుటుంబసభ్యులు ఇలాంటి వాటిని ప్రారంభంలోనే గుర్తించాలి. వారితో ప్రేమగా మాట్లాడి సమస్యలను తెలుసుకుని వాటి పరిష్కారానికి ప్రయత్నించడంతోపాటు మానసిక వైద్యుని వద్దకు తీసుకెళ్తే ప్రయోజనం ఉంటుంది.

ఈ ఏడాదిలో..



నెల్లూరులో రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్న గుర్తుతెలియని వ్యక్తి



ఆచారివీధిలో మహిళ మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

- రైలు కింద పడి గుర్తుతెలియని మహిళ ఆత్మహత్య చేసుకుంది.
- నెల్లూరు హౌసింగ్ బోర్డు కాలనీ సమీప రైలు పట్టాలపై ఓ వ్యక్తి బలవన్మరణం.
- కుటుంబ కలహాలతో విడవలూరు మండలం ఇందిరమ్మ కాలనీలో నరసింహం అనే వ్యక్తి ఉరేసుకున్నాడు.
- నెల్లూరు నగరంలోని ఆచారి వీధిలో కుటుంబ కలహాలతో దుర్గా అనే మహిళ ఉరేసుకుంది.
- కుమారుడిని అత్త మందలించడాన్ని జీర్ణించుకోలేక రుబీనా అనే మహిళ బలవన్మరణం చెందింది.
- మద్యం తాగొద్దని చెప్పినందుకు మనస్తాపం చెంది నీలగిరి సంఘంలో రామ్మోహన్ అనే వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు.
- నెల్లూరు ఎన్టీఆర్ నగర్‌లో ప్రేమ విఫలమై రాకేష్‌కుమార్ యాదవ్ అనే యువకుడు ఉరేసుకున్నాడు.
- అనుమసముద్రంపేటకు చెందిన రబ్బానీ అనే వ్యక్తి ఉరేసుకుని బలవన్మరణానికి పాల్పడ్డాడు.
- నెల్లూరు ఆచారివీధిలో స్వల్ప వివాదంతో మనస్తాపానికి గురైన రాజేశ్వరి అనే మహిళ ఉరేసుకుంది.

ఇలా ఎదుర్కోవచ్చు



ఆత్మహత్య భావనను ధైర్యంగా ఎదుర్కోవచ్చు. ఆత్మవిశ్వాసం, మంచి ఆలోచనలు చక్కటి ఫలితాలను ఇస్తాయి. సానుకూల దృక్పథం, పుస్తక పఠనం, కౌన్సెలింగ్ ప్రక్రియ శక్తివంతంగా పనిచేస్తాయి. ఆత్మహత్య భావన ఉన్న వారిని ఒంటరిగా ఉంచకూడదు. వీలైనంత వరకు ఇంట్లో వారందరి మధ్య మెలిగేలా చూసి ధైర్యం నింపాలి. జీవితంపై ప్రతికూల భావాలను వ్యక్తీకరించినప్పుడు కుటుంబసభ్యులు తేలికగా తీసుకోకుండా వైద్య నిపుణులచే కౌన్సెలింగ్ ఇప్పించాలి.

– డాక్టర్ గంగాధర్, అసోసియేట్ ప్రొఫెసర్, జీజీహెచ్, నెల్లూరు

ఉరేసుకుని వివాహిత ఆత్మహత్య

నెల్లూరు(క్రైమ్): క్షణికావేశంలో ఓ వివాహిత ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన నెల్లూరులోని మధ్వపతివారి వీధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. నెల్లూరు మధ్వపతివారి వీధికి చెందిన కె.చెంచయ్య, రాజేశ్వరి (40) దంపతులకు కుమారుడు సురేష్, కుమార్తె శ్రావణి సంతానం. చెంచయ్య ఆచారి వీధిలోని ఓ అపార్ట్‌మెంట్‌లో వాచ్‌మెన్‌గా పనిచేస్తున్నాడు. నగదు విషయమై దంపతుల నడుమ ఈనెల 13వ తేదీన గొడవ జరిగింది. దీంతో మనస్తాపానికి గురైన రాజేశ్వరి 14వ తేదీ వెంకటగిరిలోని తన తల్లి వద్దకు వెళ్లింది. గురువారం తిరిగి నెల్లూరుకు వచ్చింది. ఇంటి వద్ద మహిళలకు సంబంధించిన లో దుస్తులు ఉండటాన్ని గమనించిన ఆమె కుమారుడికి ఫోన్ చేసి అవి ఎవరివని అడిగింది. సమీపంలోని వారి ఇళ్ల నుంచి పడి ఉంటుందని చెప్పాడు. రాత్రి 8 గంటల సమయంలో షాపులో పనిముగించుకుని సురేష్ ఇంటికొచ్చాడు. లో దుస్తుల విషయమై రాజేశ్వరి గొడవ చేయడంతో అతను ఇంట్లో నుంచి వెళ్లిపోయాడు. కొంతసేపటి అనంతరం ఇంటికి చేరుకున్న సురేష్ బెడ్‌రూమ్ తలుపు తీయగా చెంచయ్య మద్యం మత్తులో నిద్రపోతున్నాడు. తల్లి ఫ్యాన్‌కు చీరతో ఉరేసుకుని వేలాడుతూ ఉండటాన్ని చూసి గట్టిగా కేకలు వేశాడు. నిద్ర లేచిన చెంచయ్య కన్నీటి పర్యంతమయ్యాడు. వారు రాజేశ్వరిని కిందకు దించి నగరంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే ఆమె మృతిచెందిందని నిర్ధారించారు. సురేష్ శుక్రవారం చిన్నబజారు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఎస్సై అబ్దుల్ రజాక్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నా కుమారుడిని చంపేశారయ్యా..

- పోలీసులకు ఫిర్యాదు చేసిన తల్లి
- మృతదేహం వెలికితీత.. పోస్టుమార్టం చేసిన వైద్యులు
- పరారీలో కోడలు



ప్రేమ్‌కుమార్ (ఫైల్)



మృతదేహాన్ని వెలికి తీసేందుకు తవ్వుతున్న దృశ్యం

కందుకూరు రూరల్: ఓ మహిళ తన కుమారుడి మృతిపై అనుమానం వ్యక్తం చేసింది. దీంతో పూడ్చిన మృతదేహాన్ని వెలికితీసి పోస్టుమార్టం నిర్వహించిన ఘటన మండలంలోని పలుకూరు గ్రామంలో శుక్రవారం జరిగింది. పోలీసులు, బాధిత కుటుంబం కథనం మేరకు.. పలుకూరు గ్రామానికి చెందిన కొండూరి సుబ్బారావు, మరియమ్మ దంపతుల కుమారుడు ప్రేమ్‌కుమార్‌కు (26) అదే గ్రామానికి చెందిన చాట్ల లక్ష్మి కుమార్తె మౌనికతో మూడేళ్ల క్రితం వివాహమైంది. వీరి మధ్య నిత్యం గొడవలు జరిగేవి. పలుమార్లు విడిపోయి వేర్వేరుగా ఉన్నారు. ఏడునెలల నుంచి వారు కలిసి ఉంటున్నారు. ఈనెల 7వ తేదీన ప్రేమ్‌కుమార్ మద్యం తాగి ఇంటికొచ్చాడు. భార్యతో గొడవ పడి లోపలికి వెళ్లి పడుకున్నాడు. ఆ తర్వాత ఎంత పిలిచినా లేవలేదు. దీంతో బంధువులు ఆర్‌ఎంపీని పిలిపించి చూపించగా అప్పటికే ప్రేమ్‌కుమార్ మృతిచెందాడని చెప్పాడు. 108 సిబ్బంది కూడా పరిశీలించి చనిపోయాడని నిర్ధారించారు. మౌనిక మేదరమెట్ల వద్ద తిమ్మన్నపాలెంలో పనుల కోసం వెళ్లిన అత్తమామలకు ఫోన్ చేసి సమాచారం ఇచ్చింది. వారు వచ్చి 8వ తేదీన కుమారుడి అంత్యక్రియలకు ఏర్పాటు చేశారు. మృతదేహానికి స్నానం చేయిస్తుండగా గొంతు వద్ద కమిలినట్లుగా గీతను గుర్తించారు. బంధువులు దానిని ఫొటోలు తీశారు. అప్పటికే ఖననానికి అన్ని ఏర్పాట్లు చేయడంతో ఆ కార్యక్రమాన్ని పూర్తి చేశారు. ఆ తర్వాత ఫొటోలను పరిశీలించి ప్రేమ్‌కుమార్ ఎందుకు చనిపోయాడని సుబ్బారావు, మరియమ్మ, బంధువులు మౌనికను నిలదీశారు. ఆ సమయంలో ఆమె సరైన సమాధానం ఇవ్వకుండా నేను చనిపోతానని బెదిరింపులకు దిగింది. బీరువాలో ఉన్న చీర బయటకు ఎందుకు వచ్చిందని మౌనిక, ఆమె తల్లి లక్ష్మిని ప్రేమ్‌కుమార్ బంధువులు ప్రశ్నించారు. అతను చీర కప్పుకొని పడుకున్నాడని వారు సమాధానమిచ్చారు. గట్టిగా నిలదీయడంతో తల్లీకుమార్తె పరారయ్యారు. గ్రామంలో కూడా లేకపోవడంతో అనుమానం బలపడి ఈనెల 13వ తేదీన మరియమ్మ కందుకూరు రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. శుక్రవారం కందుకూరు సీఐ వెంకటేశ్వరరావు, రూరల్ ఎస్సై మహేంద్రనాయక్, తహసీల్దార్ ఇక్బాల్ పర్యవేక్షణలో నెల్లూరు జిల్లా మెడికల్ కళాశాల ప్రొఫెసర్ ప్రేమ్‌కుమార్ మృతదేహాన్ని వెలికితీసి పోస్టుమార్టం నిర్వహించారు. దాని నివేదిక వస్తే ప్రేమ్‌కుమార్ ఎలా చనిపోయాడో అనే విషయం బయటకు వస్తుందని పోలీసులు తెలిపారు.

వారే హత్య చేసి ఉంటారు

ఆరోజు ప్రేమ్‌కుమార్ ఎంతో సంతోషంగా మాతో వీడియో కాల్ మాట్లాడాడు. తర్వాత గంటకే చనిపోయినట్లు ఫోన్ వచ్చింది. కోడలికి ఏమీ తెలియకపోతే ఎందుకు పారిపోయింది. మౌనిక, లక్ష్మి నా కొడుకుని హత్య చేసి ఉంటారు.

– మరియమ్మ


ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన తప్పనిసరి

నెల్లూరు(క్రైమ్): ట్రాఫిక్ నిబంధనలపై ప్రతిఒక్కరూ తప్పనిసరిగా అవగాహన కలిగి ఉండాలని జిల్లా యువజన అధికారి ఎ.మహేంద్రరెడ్డి సూచించారు. నెహ్రూ యువ కేంద్రం ఆధ్వర్యంలో శుక్రవారం రహదారి భద్రతా మాసోత్సవాలు ప్రారంభమయ్యాయి. ఎన్‌సీసీ క్యాడెట్లు, కృష్ణచైతన్య డిగ్రీ కళాశాల విద్యార్థులు నెల్లూరు వీఆర్సీ సెంటర్‌లో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సౌత్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ వెంకటరెడ్డి ట్రాఫిక్ నిబంధనలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. వేగ నియంత్రణ, ట్రాఫిక్ నిబంధనలను పాటించడం ద్వారా ప్రమాదాల శాతాన్ని తగ్గించవచ్చన్నారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్, కార్లు నడిపే వారు సీటు బెల్టు విధిగా ధరించాలన్నారు. మైనర్ డ్రైవింగ్ నేరమన్నారు. కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్ కో–ఆర్డినేటర్ డాక్టర్ ఉదయ్‌శంకర్, బి.సతీష్‌కుమార్, కవిత తదితరులు పాల్గొన్నారు.



వీఆర్సీ సెంటర్ వద్ద ర్యాలీ

ఫ్లెమింగో ఫెస్టివల్‌కు సర్వం సిద్ధం



పులికాట్ సరస్సులో ఫ్లెమింగోలు

- నేటి నుంచి 20వ తేదీ వరకు..

సూళ్లూరుపేట: ఫ్లెమింగో ఫెస్టివల్ – 2025 శనివారం నుంచి మూడురోజులపాటు జరుగుతుంది. దీనికి సంబంధించిన ఏర్పాట్లను శుక్రవారం తిరుపతి జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్ పరిశీలించారు. సూళ్లూరుపేట ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రాంగణం, అటకానితిప్ప పర్యావరణ విజ్ఞాన కేంద్రం, పులికాట్ సరస్సులో ఏర్పాట్లను పరిశీలించి అధికారులకు సూచనలిచ్చారు. తొలిరోజు రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ చేతులు మీదుగా కార్యక్రమాలు ప్రారంభం కానున్నాయి. శ్రీచెంగాళమ్మ ఆలయం నుంచి ర్యాలీని నిర్వహించనున్నారు. 19న ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం వరకు క్రీడా పోటీలు, సాయంత్రం 4 నుంచి 5 గంటల వరకు పాఠశాల విద్యార్థులకు సాంస్కృతిక పోటీలు, 5 నుంచి 7 గంటల వరకు నృత్య ప్రదర్శనలు, 7 నుంచి రాత్రి 11 గంటల ప్రముఖ కళాకారులచే సాంస్కృతిక ప్రదర్శనలుంటాయి. 20న ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంటల వరకు సంప్రదాయ వంటల పోటీలు, 4 నుంచి 5 గంటల వరకు ఫెస్టివల్ ముగింపు తదితర కార్యక్రమాలు జరుగుతాయని అధికారులు పేర్కొన్నారు.

1,17,216 విదేశీ విహంగాలు

ఇక్కడికొచ్చే విదేశీ వలస పక్షుల్లో అతి అందమైంది ఫ్లెమింగో కావడంతో దాని పేరుతో పండగను నిర్వహిస్తున్నారు. సూళ్లూరుపేట – శ్రీహరికోట రోడ్డు మార్గంలో పులికాట్ సరస్సులో నీళ్లు సమృద్ధిగా ఉండటంతో ఫ్లెమింగోలు గుంపులు గుంపులుగా దర్శనమిస్తున్నాయి. పులికాట్ సరస్సు, నేలపట్టులో కలిపి సుమారు వందల రకాలకు చెందిన 1,17,216 స్వదేశీ, విదేశీ వలస విహంగాలు విచ్చేసినట్టు పులికాట్ వన్యప్రాణి సంరక్షణాధికారులు వెల్లడించారు. నేలపట్టులో పక్షుల సందర్శన, తడ మండలం భీములవారిపాళెం పడవల రేవు వద్ద బోట్ షికార్ ఏర్పాటు చేశారు.



నేలపట్టులో తెల్లకంకణాయిలు

జెండర్ ఈక్వాలిటీ



ఇంటింటా లక్ష్మీకళ



ఐఏఎస్ అధికారి పరికిపండ్ల నరహరి

ఆడపిల్ల పుడితే 'అయ్యో' అంటూ సానుభూతి చూపే వాళ్లు మన దేశంలో ఎన్నోచోట్ల కనిపిస్తారు. మధ్యప్రదేశ్‌లో ఈ ధోరణి మరీ ఎక్కువ. ఆడపిల్ల పుడితే ఆర్థికభారంగా భావించి పురిట్లోనే ప్రాణం తీసిన సంఘటనలు ఎన్నో ఉన్నాయి. ఈ పరిస్థితుల్లో మార్పు తేవడానికి మన తెలుగు బిడ్డ, ఐఏఎస్ అధికారి పరికిపండ్ల నరహరి 'లాడ్లీ లక్ష్మి యోజన'తో నడుం బిగించారు. ప్రతిష్ఠాత్మకమైన 'బేటీ బచావో బేటీ పడావో' కు స్ఫూర్తిగా నిలిచిన ఈ సంక్షేమ పథకాన్ని పదిహేను రాష్ట్రాలు అనుసరిస్తున్నాయి.

కొన్ని సంవత్సరాల క్రితం...

కొందరు ప్రభుత్వ ఉన్నతాధికారులతో సమావేశం అయ్యారు అప్పటి మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్. ఆడపిల్ల పుడితే భారంగా భావించడం నుంచి భ్రూణహత్యల వరకు ఎన్నో విషయాలపై మాట్లాడారు. ఆయన మాటల్లో ఎంతో ఆవేదన కనిపించింది.

'ఈ పరిస్థితుల్లో మనం మార్పు తేవాలి' అనే పట్టుదల కనిపించింది.

'మనం మాత్రం ఏం చేయగలం సర్, ప్రజలు అలా ఆలోచిస్తున్నారు!' అని ఆ అధికారులు చేతులెత్తేస్తే కథ కంచికి వెళ్లినట్లే. అయితే కథ అక్కడితో ముగిసిపోలేదు. అక్కడినుంచే మొదలైంది.

ముఖ్యమంత్రితో సమావేశం అయిన వారిలో ఐఏఎస్ అధికారి నరహరి కూడా ఉన్నారు. ఒక సమస్యకు పది రకాల పరిష్కార మార్గాలు ఆలోచించడం ఆయన సొంతం.

'మనం ఏం చేయలేమా!'... సీఎం ఆవేదనపూరిత మాటలు నరహరి మనసులో సుడులు తిరిగాయి.



'కచ్చితంగా చేయాల్సిందే. చేయగలం కూడా' అని ఒకటికి పదిసార్లు అనుకున్నారు.

పేదింటి బిడ్డ అయిన నరహరికి పేదోళ్ల కష్టాలు తెలియనివేమీ కాదు.

ఆడపిల్ల అంటే పనిగట్టుకొని వ్యతిరేకత లేకపోయినా పేదరికం వల్ల మాత్రమే 'ఆడబిడ్డ వద్దు' అనుకునే వాళ్లను ఎంతోమందిని చూశారు. ఆ జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ క్షేత్రస్థాయిలో అధ్యయనం చేయడానికి హరియాణ, పంజాబ్... మొదలైన రాష్ట్రాల్లో ఎన్నో ప్రాంతాలు తిరిగారు. ఎన్నో కోణాలలో ఎన్నో ప్రశ్నలు వేశారు.

'మేం బతకడమే కష్టంగా ఉంది. ఇక ఆడబిడ్డను ఎలా బతికించుకోవాలి సారు' అనే మాటలను ఎన్నో ప్రాంతాలలో విన్నారు.

వారికి ఆర్థిక భరోసా ఇస్తే సమస్యకు పరిష్కారం దొరికినట్లే కదా! అలా మొదలైందే లాడ్లీ లక్ష్మి యోజన(గారాల కూతురు). ఇది సంక్షేమ పథకం మాత్రమే కాదు... సామాజిక మార్పు తెచ్చిన శక్తి. ఆడపిల్ల భారం అనే భావన తొలగించేందుకు వారికి ముందు ఆర్థిక భరోసా కల్పించాలి. అదే సమయంలో అమ్మాయిలను విద్యావంతులను చేయాలి... ఈ కోణంలో పథకానికి రూపకల్పన చేశారు. 'పుట్టగానే అమ్మాయిని లక్షాధికారి చేస్తాం' అని ప్రకటించారు. అయితే ఆ డబ్బు చేతికందడానికి షరతులు విధించారు. అమ్మాయి ఇంటర్ పూర్తి చేయాలి. 5వ తరగతి పూర్తి చేస్తే రూ.2000, 8వ తరగతి పూర్తి చేస్తే రూ.4000 చొప్పున ప్రతి తరగతికి బోనస్ చెల్లింపులు చేశారు. అమ్మాయికి పద్దెనిమిది ఏళ్లు వచ్చాక మాత్రమే 'లాడ్లీ లక్ష్మి యోజన' కు సంబంధించిన డబ్బులు చెల్లించేవారు. అలా పథకం వందశాతం విజయవంతమైంది.

ఆడపిల్ల పుడితే రైఫిల్ లైసెన్స్!

మధ్యప్రదేశ్‌లోని చంబల్‌లోయ ప్రాంతాల్లో కొన్ని కులాల ప్రజలు రైఫిల్‌ను సామాజిక హోదాగా భావిస్తారు. మగవారు సైకిల్ మీద తిరిగినా భుజాన తుపాకీ ఉండాల్సిందే! ఆడపిల్లలను పురిట్లోనే చంపేసేవారు కూడా ఆ ప్రాంతాల్లో ఎక్కువే. ఆ ప్రాంతాలలో 'లాడ్లీ లక్ష్మి యోజన' అంతగా ఫలితం ఇవ్వలేదు. దీంతో ప్రతి 1000 మంది బాలురకు 400 మంది బాలికలే మిగిలారు. ఈ సమస్యను దృష్టిలో పెట్టుకొని ఆయా కులాల వారితో సమావేశం నిర్వహించారు. 'ఆడపిల్లలను మీరు వద్దనుకుంటూ పోతే వారే కాదు చివరికి మీ కులాలు త్వరలోనే అంతరించి పోవడం ఖాయం' అని కులపెద్దలకు చెప్పారు. దీంతో వారిలో మార్పు వచ్చింది. అయితే తమకు తుపాకీ లైసెన్స్ లేకుండా ఉండలేమన్నారు. దీంతో ఆడపిల్ల పుడితే రైఫిల్ లైసెన్స్ అని నిబంధన విధించారు!

2007 నుంచి 50 లక్షల మంది ఆడపిల్లలు ఈ పథకం ద్వారా లబ్ధి పొందారు. బాలికల లింగ నిష్పత్తి 400 నుంచి 950కి పెరిగింది. 'లాడ్లీ లక్ష్మి యోజన' ద్వారా సామాజిక ఫలాలు అందుతున్న తీరును అధ్యయనం చేసి ఎంతోమంది పీహెచ్‌డీ చేశారు.

లింగ వివక్షకు తావు లేని సమాజాన్ని కల కంటున్నారు నరహరి. అది చారిత్రక అవసరం. తక్షణ అవసరం.

– భాషబోయిన అనిల్‌కుమార్,
సాక్షి ప్రతినిధి
కరీంనగర్

పేదింటి బిడ్డ

ఎంతోమంది ఆడపిల్లల జీవితాల్లో వెలుగులు నింపిన నరహరిది తెలంగాణలోని పెద్దపల్లి జిల్లా బసంత్‌నగర్. నిరుపేదింట జన్మించిన నరహరి కష్టపడి చదివి ఐఏఎస్ అయ్యారు. ప్రస్తుతం పబ్లిక్ హెల్త్ ఇంజినీరింగ్ విభాగంలో ప్రిన్సిపల్ సెక్రటరీ హోదాలో ఉన్నారు. జన్మభూమికి ఏదైనా చేయాలనే ఆశయంతో 'ఆలయ ఫౌండేషన్' స్థాపించి స్థానికంగా విద్య, వైద్య, ఆరోగ్య సంబంధమైన సేవాకార్యక్రమాలు చేపడుతున్నారు.

భ్రూణహత్యల నివారణకు...

'లాడ్లీ లక్ష్మి యోజన' పథకం విజయవంతంగా అమలు చేస్తూనే మరోవైపు భ్రూణహత్యలపై దృష్టి సారించారు. ఇందుకోసం ఆశావర్కర్లు, అంగన్ వాడీ కార్యకర్తలు, నర్సులు, కిందిస్థాయి సిబ్బందితో విస్తృతమైన విజిలెన్స్ నెట్‌వర్క్ ఏర్పాటు చేశారు. తప్పుదారి పట్టిన వైద్యులపై కేసులు నమోదు చేశారు. దీంతో చట్టాన్ని ఉల్లంఘించిన వైద్యులు దారికొచ్చారు.

● నగధగలు

ఇంట్లోనే ఇలా మెరిపిద్దాం!



ఆభరణాలను ధరించే కొద్దీ మెరుపు తగ్గిపోతాయని అపోహ పడుతుంటాం. కానీ వాటి మెరుపు ఎక్కడికీ పోదు. రోజూ ధరించే బంగారు ఆభరణాలు గాలి, దుమ్ము, ధూళి, వాయు కాలుష్యం కారణంగా మసకబారుతుంటాయి. వాటికి మెరుగు పెట్టించాలనుకుని దుకాణాలకు వెళ్లాల్సిన అవసరం లేదు. నెలకోసారి ఇంట్లోనే శుభ్రం చేసుకోవచ్చు.

● ఒక పాత్ర (మెటల్ పాత్ర వాడరాదు, ప్లాస్టిక్ పాత్ర వాడాలి)లో డిష్ వాష్ లిక్విడ్ నాలుగు చుక్కలు వేసి గోరువెచ్చని నీటిని పోసి కలపాలి. ఆ తరవాత ఆభరణాలను నీటిలో మునిగేలా ఉంచి 15 నిమిషాల తర్వాత చేత్తో రుద్ది కడగాలి. ఆ తర్వాత మంచినీటి పాత్రలో పెట్టి వేళ్లతో మృదువుగా రుద్దుతూ సబ్బు వదిలేటట్లు శుభ్రం చేయాలి.

● నీటితో శుభ్రం చేసిన తర్వాత పేపర్‌తో తుడిచే ప్రయత్నం చేయరాదు. మెత్తటి కాటన్ వస్త్రాన్ని ఒత్తుగా నాలుగు మడతలు వేసి ఆభరణాన్ని ఉంచాలి. శుభ్రం చేసిన ఆభరణాన్ని బీరువాలో పెట్టాలంటే ఆభరణంలో ఏ మాత్రం తేమ లేకుండా ఆరిన తర్వాత మాత్రమే భద్రపరచాలి.

● ఆభరణాలను శుభ్రం చేసేటప్పుడు పాటించాల్సిన నియమం ఏమిటంటే... ఒక్కొక్క ఆభరణాన్ని విడిగా శుభ్రం చేయాలి. చెవికమ్మలు, రింగుల వంటి వాటిని కలిపి నానబెట్టి శుభ్రం చేసే అలవాటు చాలామందికి ఉంటుంది. కలిపి ఒకే పాత్రలో నానబెట్టాల్సి వస్తే అడుగు వెడల్పుగా ఉండి ఒక కమ్మ మరొక కమ్మకు తగలకుండా జాగ్రత్త తీసుకోవాలి. అలాగే కడిగేటప్పుడు కూడా ఒకదానికి మరొకటి తగులుతూ ఉంటే గీతలు పడతాయి.

● రాళ్లు పొదిగిన బంగారు ఆభరణాన్ని శుభ్రం చేయాలంటే నీటిలో నానబెట్టరాదు. మొదట సబ్బు నీటితో ముంచిన మెత్తని వస్త్రంతో ఆభరణాన్ని తుడవాలి. ఆ తర్వాత మంచినీటిలో ముంచిన క్లాత్‌తో తుడవాలి. తుడిచిన తర్వాత మెత్తటి టవల్ మీద ఆభరణాన్ని తలకిందులుగా (ఈ స్థితిలో ఆభరణంలో పొదిగిన రాయి కిందగా టవల్‌ను తాకుతూ ఉంటుంది. బంగారు పైకి కనిపిస్తుంటుంది) ఆరబెట్టాలి. ఇలా ఆరబెట్టడం వల్ల రాయికి బంగారానికి మధ్య తేమ చేరకుండా ఉంటుంది.



జియా నస్రీన్
జెమాలజిస్ట్

సమాజ హితం కోసం...

ప్రకృతికి దగ్గరగా



డాక్టర్ చెన్నమనేని పద్మ



పూజా రాథోడ్

'నా బిడ్డలు ఆరోగ్యంగా జీవించడానికి వారికి నేను ఇలాంటి భూగోళాన్ని ఇస్తున్నానా?' అని ఆవేదన చెందుతోంది పూజా రాథోడ్. ప్రకృతి మనకు అన్నీ ఇచ్చింది. సహజమైన వనరులతో ప్రకృతి సిద్ధంగా జీవించడానికి మనమెందుకు సిద్ధంగా ఉండడం లేదు... అని ప్రశ్నిస్తున్నారు డాక్టర్ చెన్నమనేని పద్మ. ఇద్దరి ఆవేదనలోని ఆంతర్యం ఒక్కటే. భూమి చల్లగా ఉంటే మన జీవితాలు ఆనందంగా గడుస్తాయని. భూమాతకు ఎదురవుతున్న పరీక్షలకు సమాధానంగా ఇద్దరూ అనుసరిస్తున్న మార్గం ఒక్కటే. ఒకరిది రాజస్థాన్ రాష్ట్రం, మరొకరిది తెలంగాణ. పర్యావరణం పట్ల వారికి ఉన్న స్పృహ ఒకరితో మరొకరికి పరిచయం లేకపోయినా, ఆలోచనలను పంచుకోకపోయినా... వారిని ఒక దారిలో నడిపిస్తున్నది మాత్రం భూమాత గురించిన శ్రద్ధ, ఆరోగ్యకరమైన జీవనం పట్ల ఆసక్తి మాత్రమే.

పూజారాథోడ్ చిత్రకారిణి. పటం మీద బొమ్మలు చిత్రిస్తారు. డాక్టర్ పద్మ ఇంటి అలంకరణ వస్తువులు, బొమ్మలు చేస్తారు. ఇద్దరూ తమ కళకు ముడిసరుకుగా ఉపయోగిస్తున్నది ప్రకృతి ప్రసాదాలను మాత్రమే. ఎర్ర మట్టి, రంపపు పొట్టు, మొక్కజొన్న పీచు, బొగ్గు, గోరింటాకు, ఆవు పేడ, గులకరాళ్లు, పూలు, వంటల్లో ఉపయోగించే పిండి... వీటికి పూజ క్రియేటివిటీ తోడైతే అద్భుతమైన వాల్ పెయింటింగ్ తయారవుతుంది. పద్మచేతిలో ఆవు పేడ గణపతి, లక్ష్మీదేవి రూపాలవుతుంది. పూజా రాథోడ్... జైపూర్‌లోని ఐఐఎస్‌యూలో విజువల్ ఆర్ట్స్‌లో కోర్సు చేసి, 'స్టూడియో ద సాయిల్' పేరుతో ఆర్ట్ స్టూడియో స్థాపించింది. డాక్టర్ చెన్నమనేని పద్మ... హైదరాబాద్‌లోని వనిత మహావిద్యాలయలో తెలుగు ప్రొఫెసర్‌గా రిటైరయ్యారు. తన విద్యార్థులకు ఎదురవుతున్న ఆరోగ్య సమస్యలను గమనించిన తర్వాత వాటి పరిష్కారం కోసం చేసిన అన్వేషణ ఇలా సహజ జీవనశైలి, జీవనశైలిలో ఆవు పాత్ర తెలిసి వచ్చాయంటున్నారు. ఒక మనిషి నిద్ర లేచిన తర్వాత పళ్లు తోముకోవడం నుంచి రాత్రి పడుకునే ముందు దోమలను పారదోలడానికి ఉపయోగించే మస్కిటో కాయిల్ వరకు రోజు మొత్తంలో ఉపయోగించే అనేక వస్తువులను గోమయం, గోమూత్రంతో తయారు చేసి చూపిస్తున్నారు. వాటి తయారీలో శిక్షణనిస్తున్నారు. ఫ్లోర్ క్లీనింగ్ లిక్విడ్, హ్యాండ్ మేడ్ సోప్స్, కీ హోల్డర్స్, ధూప్ స్టిక్స్, జపమాల, వాకిలి తోరణాలు... ఇలా రకరకాల వస్తువులు తయారు చేస్తోందామె. సస్టెయినబుల్ లైఫ్ స్టైల్ పట్ల సమాజాన్ని చైతన్యవంతం చేయడానికి తన రిటైర్‌మెంట్ జీవితాన్ని అంకితం చేసినట్లు చెప్పారు పద్మ. ఆవును బతికించుకుంటే క్యాన్సర్ రహిత సమాజాన్ని సాధించవచ్చని నిరూపించాలనేది ఆమె ఆశయం. ఇందుకు ఆవును పెంచుకోమని బోధించడం వల్ల ప్రయోజనం లేదని గ్రహించిన తర్వాత స్వయంగా రెండు వందల గోవుల సంరక్షణ బాధ్యతను స్వీకరించారు. అందుకోసం హైదరాబాద్ నగరాన్ని వదిలి జగిత్యాల జిల్లాలోని సొంతూరు బోర్నపల్లికి వెళ్లి అక్కడే స్థిరపడ్డారు పద్మ. ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణం తన గ్రామం నుంచే మొదలుపెట్టారు.

– వాకా మంజులారెడ్డి, సాక్షి ఫీచర్స్ ప్రతినిధి




సహజ సిద్ధంగా...




ఆవు తనకు చేతులెత్తి మొక్కమని చెప్పదు. తనను ఉపయోగించుకుని ఆరోగ్యంగా జీవించమని కోరుతుంది. అందుకే ఆవును అమ్మతో సమానం అని చెబుతారు. ఆవుతో వచ్చే ఆరోగ్యం గురించి చెప్పడానికి మాటలు చాలవు. ఆవును ఎన్ని రకాలుగా మన దైనందిన జీవితంలో భాగం చేసుకోవచ్చో తెలియచేయడానికి నెలకు ఐదువందల రూపాయలకు ఒక కిట్ తయారు చేశాను. అందులో ఇంటిని శుభ్రం చేసుకునే క్లీనింగ్ మెటీరియల్ నుంచి దేహాన్ని శుభ్రం చేసుకునే వస్తువుల వరకు అన్నీ ఉన్నాయి. రసాయన రహితమైన, ప్రకృతి సహజమైన జీవన విధానాన్ని ప్రోత్సహించడం కోసం నా ప్రయత్నం కొనసాగుతోంది. క్యాన్సర్‌ను దూరంగా ఉంచాలంటే మనం ప్రకృతికి దగ్గరగా జీవించాలి. నేలను భద్రంగా ఉంచుకోవాలి. రసాయనాలతో నేల కాలుష్యం, నీరు కాలుష్యం కావడంతో మన దేహమూ కాలుష్య కాసారమవుతోంది. క్యాన్సర్‌కు ఆహ్వానం పలుకుతోంది. ఈ దుస్థితి నుంచి మనం బయటపడాలి.

– డాక్టర్ చెన్నమనేని పద్మ,
విశ్రాంత ఆచార్యులు, సామాజిక కార్యకర్త









సోషల్ మీడియా

బామ్మ కోసం... ఫ్లయింగ్ ఫ్రమ్ దుబాయి!





బామ్మతో జైనబ్ రోష్నా

జైనబ్ రోష్నా దుబాయిలో ఉంటుందన్న మాటేగానీ కేరళలోని బామ్మ జ్ఞాపకాలు ఎప్పుడూ తనతోనే ఉంటాయి. ఆ జ్ఞాపకాలు హాయిగా ఉంటాయి, నవ్విస్తాయి. కొన్నిసార్లు భావోద్వేగానికి గురి చేస్తాయి. తనకు తీరిక దొరికినప్పుడల్లా బామ్మతో ఫోన్‌లో మాట్లాడుతుంది జైనబ్.

'ఇలా ఫోన్‌లో మాట్లాడుకోవడమేనా! నన్ను చూడడానికి ఎప్పుడు వస్తావు?' అని అడుగుతుంది బామ్మ.

'నువ్వు దూరంగా ఉంటే కదా రావడానికి. నువ్వు ఎప్పుడూ నా కళ్ల ముందే ఉంటావు' అని నవ్వుతుంది జైనబ్.

'నీ మాటలకేంగానీ... నువ్వు నన్ను చూడడానికి రావాల్సిందే' అన్నది బామ్మ.

అటు నుంచి నవ్వు మాత్రమే వినిపించింది!

కట్ చేస్తే...

ఆ రోజు బామ్మగారి బర్త్‌డే. తన ఊళ్లో ఆ రోజు కూడా బామ్మ అన్ని రోజులలాగే ఎప్పటిలాగే ఉంది. 'నా బర్త్‌డేను జైనబ్ ఎంత ఘనంగా చేసేదో' అంటూ గతాన్ని గుర్తు చేసుకుంది.

ఇంతలో ఎవరో వస్తున్న అలికిడి వినిపించింది.

ఎవరా అని చూస్తే... ఊహించని వ్యక్తి.

'నిజమా? భ్రమా!' అనుకుంటుండగానే సంతోషంగా అరిచింది జైనబ్.

స్వీట్ షాక్ నుంచి తేరుకున్న తరువాత...

'నన్ను చూడడానికి వచ్చావా తల్లీ... ఒక్క మాటైనా చెప్పలేదు...' అంటూ సంతోషంతో కళ్లనీళ్ల పెట్టుకుంది బామ్మ.

'ముందే చెబితే ఏం మజా ఉంటుంది! ఇలా వస్తేనే సర్‌ప్రైజింగ్‌గా ఉంటుంది' అన్నది జైనబ్.

ఆ రోజు వంద పండగలు ఒకేసారి వచ్చినంత సంతోషంగా ఫీల్ అయింది బామ్మ. ప్రేమగా, గారాబంగా మనవరాలిని ముద్దు పెట్టుకుంది.

'గత ఏడాది మా అమ్మమ్మ పుట్టిన రోజున నా ఎమిరేట్స్ యూనిఫాం ధరించి వీడియో కాల్ చేశాను. నన్ను యూనిఫాంలో చూసి అమ్మమ్మ ఆశ్చర్యపడింది. కొత్త అమ్మాయిని చూసినట్లుగా ఉంది అని నవ్వింది. ఈ పుట్టిన రోజుకు మరింత సర్‌ప్రైజ్ ఇవ్వాలనుకున్నాను. అందుకే చెప్పకుండా వచ్చాను' అని ఇన్‌స్టా పోస్ట్‌లో రాసింది జైనబ్.

ఒక్క మాటలో చెప్పాలంటే... ఇది మామూలు సంఘటన. అయితే సోషల్ మీడియాలో బామ్మ, మనవరాళ్ల వీడియో ఎంతో సందడి చేస్తోంది. దుబాయి నుంచి వచ్చిన జైనబ్ బామ్మ గదిలోకి సంతోషంగా పరుగెత్తుతున్న దృశ్యాలు నెటిజనులను ఆకట్టుకున్నాయి.

జైనబ్ ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేసిన వీడియో క్లిప్ 2.3 మిలియన్‌ల వ్యూస్ సొంతం చేసుకుంది.

ఈ వీడియో క్లిప్ నేపథ్యంలో అమ్మమ్మ, నానమ్మలతో తమకు ఉన్న విలువైన జ్ఞాపకాలు పంచుకున్నారు నెటిజనులు.

'అమ్మ దగ్గర కంటే అమ్మమ్మ దగ్గరే నాకు చనువు ఎక్కువ. ఈ వీడియో క్లిప్ చూసినప్పుడు మా అమ్మమ్మ గుర్తుకు వచ్చి కళ్లలో నీళ్లు తిరిగాయి. పెద్దవాళ్లు మన నుంచి ఏమీ కోరుకోరు. మనం వారికి ఒకసారి కనిపించినా పెద్ద బహుమతిగా ఫీలవుతారు' అని స్నేహ అనే నెటిజన్ తన కామెంట్ పోస్ట్ చేసింది.

సోషల్ మీడియాలో ఈ బామ్మ, మనవరాళ్ల వీడియో ఎంతో సందడి చేస్తోంది. దుబాయి నుంచి వచ్చిన జైనబ్ బామ్మ గదిలోకి సంతోషంగా పరుగెత్తుతున్న దృశ్యాలు నెటిజనులను ఆకట్టుకున్నాయి. జైనబ్ ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేసిన వీడియో క్లిప్ 2.3 మిలియన్‌ల వ్యూస్ సొంతం చేసుకుంది.

వంటిల్లు

హెల్దీ లంచ్ బాక్స్

స్కూలుకెళ్లే పిల్లలున్న ఇంటి కళ వేరు. డ్రాయింగ్ రూమ్‌లో స్కూలు బ్యాగ్‌లు. వంటగదిలో లంచ్ బాక్సులు పలకరిస్తాయి. ఆ వంటింటి మెనూ భిన్నంగా ఉంటుంది. రోజూ కొత్తగా వండాలి... హెల్దీగా ఉండాలి. ఆ తల్లికి వంట రోజూ ఓ మేధోమథనమే. వారంలో ఓ రోజు ఇలా ట్రై చేయండి.

పనీర్ బటర్ మసాలా

కావలసినవి: పనీర్ ముక్కలు– ఒకటిన్నర కప్పు; ఉల్లిపాయ ముక్కలు – ముప్పావు కప్పు; టొమాటో ముక్కలు– కప్పు; వెల్లుల్లి రేకలు– 4; అల్లం తురుము – టీ స్పూన్; పచ్చిమిర్చి– 2; జీడిపప్పు– పది పలుకులు; పాలు– అర కప్పు; మీగడ – పావు కప్పు; కసూరీ మేథీ లేదా తాజా మెంతి ఆకు – టీ స్పూన్; ధనియాల పొడి– టీ స్పూన్; మిరప్పొడి– టీ స్పూన్; పసుపు – పావు టీ స్పూన్; వెన్న – 2 టీ స్పూన్‌లు; ఉప్పు – అర టీ స్పూన్ లేదా రుచిని బట్టి; కొత్తిమీర తరుగు– 3 టేబుల్ స్పూన్‌లు.

పోపు కోసం... నూనె – టేబుల్ స్పూన్; యాలకులు – 2; లవంగం – 1; దాల్చిన చెక్క – అంగుళం ముక్క;



తయారీ: ● పనీర్ ముక్కలను వేడి నీటిలో వేసి మెత్తబడే వరకు పక్కన ఉంచాలి. ● బాణలిలో నూనె వేడి చేసి మీగడ, వెల్లుల్లి, అల్లం, పచ్చిమిర్చి, ఉల్లిపాయ ముక్కలు, జీడిపప్పు వేసి ఒక మోస్తరుగా వేయించాలి. వీటిని ఒక ప్లేట్‌లోకి తీసుకుని అదే బాణలిలో మిగిలిన నూనెలో లవంగాలు, యాలకులు, దాల్చిన చెక్క వేయించాలి. ఆ తర్వాత మిరప్పొడి, ధనియాల పొడి, పసుపు, మేథీ వేసి పచ్చిదనం పోయే వరకు వేయించాలి. ● ఉల్లిపాయ, టొమాటో ముక్కలు, జీడిపప్పు చల్లారిన తర్వాత మిక్సీలో గ్రైండ్ చేసి ఆ మిశ్రమాన్ని బాణలిలో వేయాలి. అందులో పాలు పోసి, ఉప్పు వేసి కలిపి చిక్కదనం, రుచి చూసుకోవాలి. మిశ్రమం ఉడకడం మొదలై బుడగలు రావడం మొదలైన తర్వాత పనీర్ ముక్కలను నీటిలో నుంచి తీసి బాణలిలో వేసి కలపాలి. మంట తగ్గించి, వెన్న వేసి, కొత్తిమీర చల్లి స్టవ్ ఆపేయాలి.

పీస్ పులావ్



కావలసినవి: బాసుమతి బియ్యం – కప్పు; పచ్చి బఠాణీ– పావు కప్పు; నీరు – 3 కప్పులు; బిర్యానీ ఆకు – ఒకటి; యాలక్కాయ – 1; లవంగం – 1; దాల్చిన చెక్క – అర అంగుళం ముక్క; ఉప్పు – పావు టీ స్పూన్ లేదా రుచిని బట్టి; నిమ్మరసం – అర టీ స్పూన్.

పోపు కోసం... నెయ్యి– 2 టేబుల్ స్పూన్‌లు; పచ్చిమిర్చి– 1 (నిలువుగా చీరాలి); షాజీరా– టీ స్పూన్.

తయారీ: ● బియ్యాన్ని కడిగి పది నిమిషాల సేపు మంచినీటిలో నానబెట్టాలి. బఠాణీలను కడిగి పక్కన పెట్టాలి. ● నీటిని ఒక పాత్రలో మరిగించాలి. నీరు మరగడం మొదలైన తర్వాత అందులో బఠాణీలు, బియ్యం వేయాలి. బియ్యం ఉడికేటప్పుడే నిమ్మరసం, యాలక్కాయ, లవంగం, దాల్చిన చెక్క, బిర్యానీ ఆకు, ఉప్పు వేయాలి. అన్నం ఉడుకుతున్నప్పుడే మరో స్టవ్ మీద ఒక పాత్ర పెట్టి అందులో నెయ్యి వేడి చేసి పచ్చిమిర్చి, షాజీరా వేసి వేగిన తర్వాత ఉడుకుతున్న అన్నంలో వేసి అన్నం మెతుకులు విరగకుండా జాగ్రత్తగా కలిపి మూత పెట్టాలి. మంట తగ్గించి నీరు ఇంకి పోయిన తర్వాత దించేయాలి.

గమనిక: ఎండు బఠాణీలైతే రాత్రంతా నానబెట్టాలి.